
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
శుక్రవారం 5 జూలై 2024





ప్రోత్సాహం కరువు

● తగ్గుతున్న కూరగాయల సాగు
● మార్కెటింగ్ సదుపాయం లేకపోవడం కారణమే
● ఇంటి అవసరాల మేరకే పండిస్తున్న రైతులు
● అవగాహన కల్పిస్తేనే మేలు

జగిత్యాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి సరైన ప్రోత్సాహం అందకపోవడం... కూలీల ఎక్కువగా అవసరం కావడం.. సరైన మార్కెట్ సదుపాయాలు లేకపోవడంతో రైతులు కూరగాయల సాగుపై ఆసక్తి చూపటం లేదు. దీంతో ప్రతీ సంవత్సరం జిల్లాలో సాగు విస్తీర్ణం తగ్గిపోతోంది. ఒకప్పుడు కూరగాయల సాగుకు కేరాఫ్‌గా ఉన్న మండలాలు సైతం ప్రస్తుతం వరి, వాణిజ్య పంటలపై దృష్టి పెట్టాయి. కేవలం ఇంటి వరకు మాత్రమే రైతులు కూరగాయలను పండిస్తున్నారు. దీంతో మార్కెట్‌లో కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి రైతులను కూరగాయాల పంటల సాగువైపు మళ్లిస్తేనే మేలు జరిగే అవకాశాలున్నాయి.

గత యేడాది 75 ఎకరాలు...ప్రస్తుతం...

జిల్లా వ్యాప్తంగా సుమారు 4,800 ఎకరాల్లో వివిధ కూరగాయల సాగు చేస్తున్నారు. గత యేడాది జిల్లా వ్యాప్తంగా కూరగాయల సాగు సుమారు 5,600 ఎకరాలు ఉండగా ప్రస్తుతం సాగు పడిపోయింది. యేడాదిలో యాసంగి, వానాకాలం, అదనపు పంట ఇలా మూడు సీజన్‌లలో కూరగాయాల సాగు చేస్తుంటారు. కూరగాయల సాగుకు కూలీల అవసరం ఎక్కువగా ఉండడం, పండించిన పంటను విక్రయించడానికి సరైన మార్కెటింగ్ లేకపోవడం, ప్రతీరోజు కూలీలతో పనులు చేయించాల్సి రావడం తదితర కారణాల వల్ల రైతులు కూరగాయల సాగును ఎంచుకోవడం లేదు. ఆకుకూరలు చిన్నపాటి వర్షానికి మురిగిపోవడం వంటి పరిస్థితులు సైతం కారణమవుతున్నాయి. ప్రతీ ఏడాది కూరగాయల సాగు విస్తీర్ణం తగ్గుతూ వస్తుంది. గతంలో పలు మండలాల పరిధిలోని చుట్టుపక్కల గ్రామాల్లో కూరగాయల సాగు అధికంగా ఉండేది. ఇంటికి సమీపంలోని ఎకరం, అర ఎక రం విస్తీర్ణంలో కూరగాయలను సాగుచేసేవారు. ఇప్పు డు అలాంటిది కేవలం తమ అవసరాలకు మాత్రమే కూరగాయలను సాగు చేస్తున్నారు.

అమ్ముకోవాలంటే ఇబ్బందులే...

రైతులు తాము పండించి కూరగాయలను అమ్ముకోవాలంటే పక్క జిల్లాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. సరైన మార్కెట్ సదుపాయాలు లేకపోవడంతో కూరగాయల సాగువైపు రైతులు మొగ్గుచూపించడం లేదు. పండించిన ఉత్పత్తులను నిజామాబాద్, హైద్రాబాద్ తదితర మార్కెట్లకు తీసు కెళ్లాల్సి వస్తోంది. మార్కెట్లు దూరంగా ఉండటంతో ఇక్కడ నుంచి అంత దూరం తీసుకెళ్లడం వ్యయ ప్రయా సాలతో కూడుకుంటుంది. తీరా తీసుకెళ్లే సమయానికి ఆలస్యం అవ్వడంతో గిట్టుబాటు ధర రావడం లేదు.

సాగు పెంచేందుకు కృషి...



ప్రతాప్‌సింగ్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, జగిత్యాల

జిల్లాలో రైతులు వరి, వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. కూరగాయల సాగులో కొంతద వెనుకబడి ఉన్నాం. రైతులకు అవగాహన కల్పించి సాగు విస్తీర్ణం పెంచే విధంగా కృషి చేస్తున్నాం. పెరుగుతున్న ధరలను దృష్టిలో పెట్టుకొని రైతులు కూరగా యలు సాగుచేస్తే లాభాలు వచ్చే అవకాశాలు అధికంగా ఉన్నాయి.

వరి, వాణిజ్య పంటల వైపు మొగ్గు..

జిల్లా రైతులు క్రమంగా కూరగాయల సాగును తగ్గించి... వరి పంట, వాణిజ్య పంటల సాగుకు రైతులు మొగ్గు చూపిస్తున్నారు. వరి పంట పండించడానికి అవసరమైన వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడం, సమృద్ధిగా నీరు లభిస్తుండడంతో వరి పంటను ఎక్కువగా పండిస్తున్నారు. దీనికి కూరగాయలు పండించే రైతులకు ప్రభుత్వం నుంచి ప్రోత్సహకాలు అందడం లేదు. గతంలో కూరగాయల విత్తనాలు ప్రభుత్వం సరఫరా చేసేది. ప్రభుత్వం పత్తి, మిర్చి, వరి విత్తనాలతో పాటు మరికొన్ని వాణిజ్య పంటలకు రాయితీలు ఇస్తున్నారు. కూరగాయలు పండించే రైతులను ప్రోత్సహించక పోవడంతో ఈ పంటలను సాగుచేసేందుకు రైతులు అనాసక్తి చూపిస్తున్నట్లు కనిపిస్తోంది. దీంతో వాణిజ్య పంటలను సాగు చేస్తున్నారు. ఇంటి వెనక ఉంటే అర ఎకరం విస్తీర్ణంలో కూడా మొక్కజొన్న సాగు చేయడమో నీటి సదుపాయం ఉంటే వరిని సాగు చేయడమో చేస్తున్నారు.

భగ్గుమంటున్న ధరలు...

జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ ప్రాంతాలతో వివిధ గ్రామాలకు ఇతర జిల్లాల నుంచి కూరగాయలు దిగుమతి అవుతున్నా యి. మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి కూడా కూరగాయలు దిగుమతి అవుతున్నాయి. దీంతో సాధారణంగానే ధరలు విపరీతంగా ఉంటున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో టమాట కిలో 80 రూపాయ లు, వంకాయ కిలో 80, బెండకాయ కిలో 60, పచ్చి మిర్చి కిలో 80, కాకరకాయ 80, బీరకాయ కిలో 80, క్యాప్సికం కిలో రూ. 80, దొండకాయ కిలో రూ. 80 పలుకుతున్నాయి. సాధారణ ప్రజానికానికి ఈ ధరలు చుక్కలను చూపిస్తున్నాయి.

ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు

జగిత్యాల, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఈనెల 6న ప్రపంచ జునోసిస్ డే సందర్భంగా పెంపుడు కుక్కలకు జగిత్యాల పట్టణ వైద్యశాలలో పశువర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేస్తామని అసిస్టెంట్ డైరెక్టర్ మదన్‌మోహన్ గురువారం ఒక ప్రటనలో తెలిపారు. ఈ సదావకాశాన్ని యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా దుర్గమ్మ బోనాల పండుగ

జగిత్యాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గోత్రాల కాలనీలో పోచమ్మ, దుర్గమ్మ ఆలయంలో గురువారం బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో పలు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పలు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

అంబులెన్స్ ఏర్పాటు చేయాలి

కొడిమ్యాల, జూలై 4: కొడిమ్యాల మండలానికి ప్రత్యేక అంబులెన్స్ ఏర్పాటు చేయాలని బీజేపీ మండల నాయకుడు బోగ రాకేష్ గురువారం కొడిమ్యాల సందర్శనకు వచ్చిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ప్రత్యేక అంబులెన్స్ ఏర్పాటు చేసినట్లయితే అత్యవసర సమయాల్లో మండల ప్రజలకు చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అంబులెన్స్ ఏర్పాటుపై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు రాకేష్ తెలిపారు.

పీహెచ్‌సీలో ప్రసూతి వైద్యసేవలు మెరుగుపర్చాలి

● కలెక్టర్ బి సత్యప్రసాద్ ● ఆసుపత్రి, తహసీల్దార్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ ● నర్సరీ, డ్రైనేజీ పరిశీలన



పీహెచ్‌సీలోని ల్యాబ్ రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్



కొడిమ్యాలలో మురికి నీటి కాల్వను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

కొడిమ్యాల, జూలై 4: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసూతి వైద్య సేవలను మరింత మెరుగుపర్చాలని కలెక్టర్ బి సత్యప్రసాద్ వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓపీ సేవలు, ఆన్‌లైన్ రిజిస్టర్‌లను పరిశీలించారు. డాక్టర్లు సమయపాలన పాలించాలని, ఒక రోజులో ఓపీ ఎంత మందిని పరిక్షిస్తున్నారని అడిగారు. సీజనల్ వ్యాధులు రాకుండా పేషెంట్లకు ఇబ్బంది కలగకుండా వైద్యసేవలు అందించాలన్నారు. ల్యాబ్ విభాగాన్ని తనిఖీ చేసి టీ హబ్‌కు పంపే డయాగ్నస్టిక్ రికార్డును పరిశీలించారు.

అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో మురికి నీరు నిల్వలేకుండా తగు జాగ్రత్తలను తీసుకోవాలని ఆదేశించారు. అంతకుముందు బస్టాండ్ సమీపంలోని మురికి నీటికాల్వను పరిశీలించి, నర్సరీని పరిశీలించి ఏ రకమైన మొక్కలు ఉన్నాయని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో నీరు ఇళ్లలోకి రాకుండ తగిన జాగ్రత్తలను తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో మధుసూదన్, డీఎంహెచ్‌వో సమీయొద్దీన్, డీపీవో స్వామి, మండల ప్రత్యేక అధికారి ప్రతాప్‌సింగ్, ఎంపీడీవో స్వరూప, తహసీల్దార్ రాజమణి, మెడికల్ ఆఫీసర్ పరమేశ్వరీ, ఏపీవో సతీష్, ఎంపీవో వాసవి, ఆర్‌ఐ కర్ణాకర్, కార్యదర్శి వంశీవర్దన్, సీహెచ్‌వో రాజశేఖర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన మండల ప్రత్యేక అధికారులు







మల్యాల ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి, రాయికల్‌లో మండల ప్రత్యేకాధికారికి స్వాగతం పలుకుతున్న అధికారులు, సిబ్బంది, బాధ్యతలు స్వీకరిస్తున్న బీర్పూర్ మండల స్పెషల్ ఆఫీసర్

రాయికల్, జూలై 4: ఎంపీపీల పదవీ కాలం ముగియగా జిల్లాలోని పలు మండలాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. ఈ మేరకు ప్రత్యేక అధికారులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. రాయికల్ మండల ప్రత్యేకాధికారిగా జగిత్యాల డీఆర్‌డీవో ఎం సంపత్‌రావు బాధ్యతలు స్వీకరించారు. మండల పరిషత్ పాలకవర్గం పదవీకాలం పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు బాధ్యతలు స్వీకరించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారికి అధికారులు, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీడీవో చిరంజీవి, మండల పంచాయతీ అధికారి సుష్మా, ఏఈ ప్రసాద్, పర్యవేక్షకులు వేణుమాధవ్, ఏపీఎం చక్రవర్తి పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: మండల ప్రత్యేక అధికారిగా కోరుట్ల రెవెన్యూ డివిజన్ అధికారి అనంద్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. మండల ప్రజపరిషత్ కార్యాలయానికి వచ్చిన ఆర్డీవోకు ఎంపీడీవో రామకృష్ణ, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎంపీవో నీరజ పుష్ప గుచ్ఛం అందించి స్వాగతం పలికారు. మండల ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన అనంద్‌కుమార్‌ను మండలస్థాయి నాయకులు పూలమాలలు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

ధర్మపురి: మండల ప్రత్యేక అధికారిగా ఏడీఏ రాంచందర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో రవీందర్, సీనియర్ అసిస్టెంట్ అజయ్‌కుమార్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ శ్రీధర మహేష్, నరేష్, పంచాయతీ కార్యదర్శులు మర్యాదపూర్వకంగా ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మల్యాల: మండల ప్రత్యేక అధికారిగా జిల్లా వ్యవసాయ అధికారి వాణీ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ అధికారులు, సిబ్బంది అభినందించారు. జిల్లా వ్యవసాయ అధికారి వాణీ మల్యాల మేజర్ గ్రామ పంచాయితీ ప్రత్యేక అధికారిగా కూడా కొనసాగుతున్నారు.

కొడిమ్యాల: కొడిమ్యాల మండల ప్రత్యేక అధికారిగా జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్‌సింగ్ గురువారం అధికార బాధ్యతలను స్వీకరించారు. మండల ప్రత్యేక అధికారికి ఎంపీడీవో స్వరూప, కార్యాలయ అధికారులు సిబ్బంది సురేందర్, సురేష్, ఏఈఈ చంద్రశేఖర్, అరుణ్, నిఖిల, కొడిమ్యాల సింగిల్ విండో చైర్మన్ రాజనర్సింగరావు, మాజీ ప్రజాప్రతినిధులు ప్రసాద్, నసీరొద్దీన్ శాలువా కప్పి స్వాగతం పలికారు.

మెట్‌పల్లి రూరల్: మెట్‌పల్లి మండల ప్రత్యేక అధికారిగా జిల్లా సహకార అధికారి సత్యనారాయణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. సత్యనారాయణకు ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణ, అధికారులు, సిబ్బంది శాలువతో సన్మానించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, ఏపీవో తిరుపతిరావు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండల ప్రత్యేకాధికారిగా జిల్లా ఫారెస్ట్ అధికారి వెంకటేశ్వర్‌రావు బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఎంపీడీవో శంకర్, ఎంపీపీ జవ్వాజి రేవతి, మండల సిబ్బంది, ఎంపీటీసీలు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. గ్రామాల్లో ప్రభుత్వం అమలు చేసే కార్యక్రమాలు విజయవంతం చేసేలా చూడాలని పిలుపునిచ్చారు.

బీర్‌పూర్: మండల స్పెషల్ ఆఫీసర్‌గా జిల్లా మైనార్టీ వెల్‌ఫేర్ అధికారి చిత్రూ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల ప్రత్యేకధికారులు గ్రామాల్లో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకరావాలని సూచించారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయ సిబ్బంది శాలువాలు కప్పి సన్మానించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీడీవో లచ్చాలు, ఎంపీవో రామకృష్ణ రాజు, సూపరింటెండెంట్ రాజమౌళి, సిబ్బంది తదితరులు ఉన్నారు.





మెట్‌పల్లి, కోరుట్ల మండలాల స్పెషల్ ఆఫీసర్లకు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

స్థానిక సంస్థలను బలోపేతం చేస్తాం

- ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి

8



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

కలెక్టర్ సత్యప్రసాద్‌ను కలిసిన జగిత్యాల ఎమ్మెల్యే



కలెక్టర్ సత్య ప్రసాద్‌తో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ సత్యప్రసాద్‌ను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ గురువారం కలిశారు. పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ సత్యప్రసాద్‌ను ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ కలిసి జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబందించిన పలు అంశాల గురించి చర్చించారు. నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన సహకారాలను అందించాలని కోరారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను కలిసిన మున్సిపల్ కమిషనర్

జగిత్యాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మున్సిపల్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు తీసుకున్న సమ్మయ్య ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డిలను గురువారం వేర్వేరుగా కలిశారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందిచారు. అదేవిధంగా పట్టణంలోని ఇందిరాభవన్‌లో ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్చం అందజేశారు.

మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యకు అభినందనల వెల్లువ

జగిత్యాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మున్సిపల్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సమ్మయ్యను గురువారం పలువురు ప్రజాప్రతినిధులు అభినందించారు.

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సమ్మయ్యను మున్సిపల్ వైస్‌చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్ తోట మల్లికార్జున్ ఇతరులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఎస్పీ అశోక్ కుమార్‌ను కలిసిన ఎస్‌బీ సీఐ



ఎస్పీతో ఎస్‌బీ సీఐ ఆరీఫ్ అలీఖాన్

జగిత్యాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ అశోక్‌కుమార్‌ను గురువారం స్పెషల్ బ్రాంచ్ సీఐ ఆరిఫ్ అలీఖాన్ కలిశారు. జగిత్యాల జిల్లా స్పెషల్ బ్రాంచ్ సీఐగా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా ఆరీఫ్ అలీఖాన్ మర్యాదపూర్వకంగా జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్‌ను పోలీసు ప్రధాన కార్యాలయంలో కలిసి పూలమొక్కను అందించారు.

బీర్‌పూర్ ఎస్‌ఐగా కుమారస్వామి



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్‌ఐ

బీర్‌పూర్, జూలై 4: బీర్‌పూర్ ఎస్‌ఐగా కందునూరి కుమారస్వామి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ఎస్‌గా బాధ్యతలు నిర్వహించిన గౌతమ్ పవర్ బదిలీపై వెళ్లగా మల్యాలలో ఎస్సైగా విధులు నిర్వహించిన కందునూరి కుమారస్వామిని బీర్‌పూర్ ఎస్సైగా నియమించారు. దీంతో గురువారం బీర్‌పూర్ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకొని బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్‌ఐ జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ అశోక్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు.

మల్యాల ఎస్‌ఐ-2 బదిలీ

మల్యాల, జూలై 4: మల్యాల ఎస్-2 కుమారస్వామి బదిలీ అయ్యారు. ఇక్కడి నుంచి బీర్‌పూర్‌కు బదిలీ అయిన ఆయన గురువారం రిలీవ్ అయి వెంటనే అక్కడ ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టారు. కొన్ని నెలలుగా విధులు నిర్వహించిన కుమారస్వామి మండలంలో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్నారు.

మానసిక వికలాంగుల పాఠశాలకు నిధులు ఇవ్వండి

● సీఎంను కలిసిన పాఠశాల ట్రస్టు చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి

తిమ్మాపూర్, జూలై4: మండలంలోని ఎల్‌ఎండీ కాలనీలో గల జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మానసిక వికలాంగుల పాఠశాలకు ప్రభుత్వం నుంచి నిధులు ఇవ్వాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పాఠశాల ట్రస్టు చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి హైదారాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ పాఠశాలకు ప్రభుత్వ పక్షాన ప్రతి నెల 8లక్షల 30వేల నిధులు మంజూరు ఇప్పించాలని సీఎంను కోరారు. 2021లో గత ప్రభుత్వంలో పూర్తి స్థాయిలో నిధులు మంజూరు చేస్తామని చెప్పి మాట నిలుపుకోలేదని, కేంద్ర ప్రభుత్వం సంవత్సరానికి 52లక్షలకు ప్రతిపాదనలు పంపిస్తే కేవలం 16లక్షలు మాత్రమే విడుదల చేసిందని సిఎం దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. పాఠశాల సిబ్బంది జీతభత్యాలకు, హస్టల్ నిర్వహణకు డబ్బు లేకపోవడంతో సంక్లిష్ట పరిస్థితులలో పాఠశాల నడుస్తున్నదని పాఠశాల నిర్వహణకు ప్రతి నెల 8లక్షల 30వేల రూపాయలు ఖర్చు అవుతుందని తెలిపారు. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం మానసిక వికాలంగుల పాఠశాలపై ప్రత్యేక దృష్టి పెట్టి సంవత్సరానికి కోటి రూపాయల ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విన్నవించినట్లు ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి కూడా దానికి సానుకులంగా స్పందించినట్లు తెలిపారు.


సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన చాడ వెంకట్‌రెడ్డి

ప్రమాదవశాత్తూ యువకులకు గాయాలు

సైదాపూర్, జూలై 4: సైదాపూర్ మండలంలోని రాయికల్ వాటర్‌ఫాల్స్ వీక్షించేందుకు వచ్చిన ఇద్దరు యువకులు ప్రమాదవశాత్తూ గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన సంపత్, మన్నెంపల్లికి చెందిన శ్రీనివాస్ అనే యువకులు రాయికల్ వాటర్‌ఫాల్స్ అందాలు చూసేందుకు గురువారం వచ్చారు. వాటర్ ఫాల్స్ వద్ద తేనటీగలు వారిపై దాడి చేశాయి. దాంతో ఆ యువకులు తేనెటీగల నుంచి తప్పించుకునేందుకు పరుగులు తీయగా జారిపడడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు, స్థానికులు ఆ యువకులను 108 వహనంలో ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

సుల్తానాబాద్, జూలై 4: మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన ఎలవేణి మల్లయ్య(54) చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. కుటుంబ తగాదాల కారణంగా జీవితంపై విరక్తి చెంది బుధవారం సాయంత్రం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా గురువారం సాయంత్రం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు లేని పాఠశాలలో ఆరుగురు ఉపాధ్యాయులు

● పాఠశాలను సందర్శించిన జడ్పీటీసీ కుమార్

చందుర్తి, జులై 4 : రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు కృషి చేస్తుండగా మండలంలోని కిష్టంపేట గ్రామంలో ఇందుకు విరుద్ధంగా విద్యా వ్యవస్థ కొనసాగుతుందని జడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్ అన్నారు. మండలంలోని కిష్టంపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఉదయం జడ్పీటీసీ సభ్యుడు కుమార్ సందర్శించారు. పాఠశాలను సందర్శించిన సమయంలో విద్యార్థుల సంఖ్య జీరో ఉండగా, ఆరుగురు ఉపాధ్యాయులకు గాను ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే హాజరయ్యారు. విద్యార్థులు లేకపోవడంతో వంతుల వారీగా ఉపాధ్యాయులు విధులకు హాజరవుతున్నట్లు ఆయన దృష్టికి వచ్చింది. ప్రధానోపాధ్యాయునితో పాటు మరో ముగ్గురు ఉపాధ్యాయులు విధులకు దుమ్మా కొట్టడంతో జడ్పీటీసీ అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులు లేకపోవడంతో ప్రతిరోజు ఉపాధ్యాయులు పాఠశాలలో కాలక్షేపం చేస్తున్నట్లు తనిఖీలో వెల్లడయింది. కొన్ని పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఎక్కువ ఉండగా ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్న పరిస్థితులు ఉన్నాయి. కిష్టంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను చూస్తే ఉపాధ్యాయ పనితీరు ఏ విధంగా ఉందో అర్థమవుతుందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు లేని పాఠశాలకు ఉపాధ్యాయులను కేటాయించడంతో లక్షలాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అవుతోందని, ఉపాధ్యాయులను ఇతర పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపాలని జడ్పిటిసి సభ్యుడు కుమార్ జిల్లా విద్యాధికారికి ఫోన్‌లో మాట్లాడి కోరారు.


పాఠశాల పరిస్థితిపై డీఈవో ఫోన్‌లో మాట్లాడుతున్న జడ్పీటీసీ

బొగ్గు బ్లాకుల వేలాన్ని నిలిపివేయాలి


కరపత్రం విడుదల చేస్తున్న ట్రేడ్‌యూనియన్ నాయకులు

భగత్‌నగర్, జూలై 4: సింగరేణి బ్లాకుల వేలాన్ని నిలిపివేయాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆల్ ట్రేడ్‌యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఆల్‌ట్రేడ్ యూనియన్ నాయకుల సమావేశం నిర్వహించి, కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి, సిఐటియు, ఐఎఫ్‌టియు, టిఎన్‌టియుసి నాయకులు టేకుమల్ల సమ్మయ్య, ఎడ్ల రమేష్, జిందం ప్రసాద్, కళ్యాడపు ఆగయ్య, కె బుచ్చయ్య యాదవ్, లక్ష్మణ్, కూరపాటి రమేష్, ముకుందరెడ్డి, యు శ్రీనివాస్, ప్రభ, స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.

● భగత్‌నగర్ : బీజేపీ ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్ డిమాండ్ చేశారు. ప్రైవేట్ సంస్థలకు మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకులను వేలం వేస్తున్నదని, సింగరేణి సంస్థను ప్రైవేట్‌సంస్థలతో వేలం పాటలో పోటీ పడాలని నిర్ణయించడం సిగ్గుచేటన్నారు. దేశభక్తి పేరుతో దేశసంపదను ప్రైవేట్ పరం చేస్తున్న బీజేపీవిధానాలను ప్రజానీకం గుర్తించి తగిన బుద్ధి చెప్పాలన్నారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రేత?

చందుర్తి, జూలై 4 : చందుర్తి మండలం మూడపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడిని గంజాయి విక్రయిస్తున్నాడని పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అరుణ్ అనే యువకుడు హైదరాబాద్‌లో రూమ్‌మేట్ వద్ద నుంచి గంజాయి తీసుకువచ్చి గ్రామంలో విక్రయిస్తున్నాడన్న అనుమానంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు.


గురుకుల పనివేళలను సమీక్షించాలి

జగిత్యాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): గురుకుల విద్యా సంస్థలకు నిర్ణయించిన పనివేళల్లో శాస్త్రీయత లోపించిందని, విద్యార్థులుకుపై మానసిక ఒత్తిని పెంచే విదంగా ఉందని, వాటిని వెంటనే పునః సమీక్షించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తిరుక్కోవెల శ్యామ్‌సుందర్, అంబటి భూమేశ్వర్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. గత ప్రభుత్వం లెక్కకు మిక్కిలి గురుకులాలను ప్రారంభించి అరకొర సౌకర్యాలున్న అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న సందర్భంలో ప్రస్తుత పనివేళలు సమర్థనీయంగా లేవన్నారు. విద్యార్థులు మూడు గంటల పాటు ఏకబిగిన అసౌకర్యమైన తరగతి గదుల్లో కూర్చోవటం, ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 1.45 వరకు భోజనం చేయకుండా ఉండడం ఎలా సాధ్యమవుతుందో అర్థం కావడం లేదన్నారు. ఉపాధ్యాయులకు స్టాఫ్‌క్వార్టర్స్ లేకుండా ఊరికి దూరంగా విద్యా సంస్థలు ఉన్న సందర్భంలో ఉదయం పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయులు రాత్రి 9 గంటల వరకు అక్కడే ఉండాల్సిన దుస్థితి నెలకొంటుందన్నారు. ప్రభుత్వ సెలవులు, పండుగ సెలవుల్లో కూడా పనిచేయాల్సిన సందర్భంలో ఉపాధ్యాయులు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతారని ఆందోళన వ్యక్తం చేశారు.

బ్యాటరీల దొంగను పట్టుకున్న స్థానికులు

ఎల్లారెడ్డిపేట, జూలై 4: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి బస్టాండులోని కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై వాహనాల బ్యాటరీల దొంగను స్థానికులు గురువారం పట్టుకున్నారు. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. గొల్లపల్లిలో కొంత కాలంగా ఆరుబయట నిలిపి ఉంచిన ఆటోలు, బైకులు, ట్రాలీ ఆటోలు, ట్రాక్టర్లకు సంబంధించిన బ్యాటరీలు చోరీకి గురవుతున్నాయి. గురువారం గొల్లపల్లి బస్టాండ్ ప్రాంతంలో నిలిపి ఉన్న ట్రాలీ ఆటో బ్యాటరీని చోరీ చేస్తుండగా స్థానికులు గమనించి పట్టుకున్నారు. అదే వాహనంలో చోరీకి పాల్పడిన వ్యక్తిని తాళ్లతో చేతులను కట్టేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. ఆరుగురు ఓ ముఠాగా ఏర్పడి బ్యాటరీలతో పాటు ద్విచక్ర వాహనాలను దొంగలిస్తున్నారని గుర్తించారు. ముఠాలో ఇద్దరు మహిళలున్నారని తేలింది.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

- ప్రాజెక్టులోకి 2,894 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. గురువారం వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్ఆర్ఎస్పీ ప్రాజెక్టులోకి 2,894 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వాటర్ వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 90.323 సామర్థ్యంకు గానూ ప్రస్తుతం 11.335 టీఎంసీల నీరు నిల్వఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 16.126 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ అవసరాలకు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 479 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఇదిలా ఉండగా జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 5.190 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

జైనాలో వైభవంగా పోచమ్మ బోనాలు

ధర్మపురి, జూలై 4: ధర్మపురి మండలంలోని జైనా గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాల వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు నెత్తి మీద బోనాలు పెట్టుకుని డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా సమీపంలో గల ఆలయానికి వెళ్లారు. అనంతరం మహిళలు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. మహిళలు అమ్మవారలకు పసుపు, కుంకుమ చల్లి, బోనాలు పెట్టి నైవేద్యం సమర్పించారు. కుటుంబసభ్యులు క్షేమంగా ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో జైనా రజక సంఘం అధ్యక్షులు సంగెపు గంగారం, గౌరవ అధ్యక్షులు సంగెపు మల్లయ్య, సభ్యులు లచ్చయ్య, వెంకటి, గంగారాం, బుచ్చయ్య, మల్లయ్య, శ్రీనివాస్, ప్రదీప్, అజయ్, సతీష్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.


జైనా రజక సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు

విద్యుత్‌చౌర్యం కేసులో ఒకరికి జైలుశిక్ష

కరీంనగర్ క్రైం, జూలై 4 : ఎలాంటి అనుమతి లేకుండా విద్యుత్‌ను చౌర్యం చేసిన కేసులో హుజురాబాద్ మండలం బోర్నపల్లికి చెందిన కేశబోయిన తిరుపతికి ఒక నెల రోజుల సాధారణ జైలు శిక్ష లేదా 14,616 రూపాయల జరిమానానాను విధిస్తూ కరీంనగర్ జిల్లా 1వ అదనపు సెషన్స్ జడ్జి డి వెంకటేష్ గురువారం తీర్పు ఇచ్చారని కరీంనగర్ ట్రాన్స్‌కో విజిలెన్స్ సీఐ ఎండీ షాదుల్లా బాబా తెలిపారు. ఈ సమావేశంలో ట్రాన్స్‌కో విజిలెన్స్ హెడ్‌కానిస్టేబుల్ ఇంతియాజ్ మహ్మద్‌ఖాన్, బి రాజయ్యలున్నారు.

రూ.7,500 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జూలై 4: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,500 పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు తొమ్మిది మంది రైతులు 181క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7500, కనిష్ఠ ధర రూ.7200 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

గంజాయి ముఠా గుట్టు రట్టు చేసిన పోలీసులు

● 2 కిలోల 70 గ్రాముల గంజాయి పట్టివేత
● వివరాలు వెల్లడించిన డీఎస్పీ రఘుచందర్

ధర్మపురి, జూలై 4: జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణ శివారులో గల హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద గంజాయి విక్రయించేందుకు వెళ్తున్న బత్తిని చందు (23), గోల్ల వెంకటేష్ (25) పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశానుసారంగా ధర్మపురి పోలీస్ సర్కిల్ కార్యాలయంలో జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల అరెస్ట్ వివరాలు వెల్లడించారు. ధర్మపురి మండలంలోని రాయపట్నం గ్రామానికి చెందిన నిందితులు చందు, వెంకటేష్ గంజాయి తాగుటకు బానిసగా మారారు. వారికి ఖర్చులకు డబ్బులు లేక గంజాయి తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇక్కడకు తీసుక వచ్చి తాగిన తర్వాత మిగిలిన గంజాయి ఎక్కువ ధరకు విక్రయించాలని నిర్ణయించినట్లు తెలిపారు. గంజాయి ఎక్కడ దొరుకుతుందో తెలుసుకుని వారి స్నేహితుడు రాము అనే వ్యక్తి వద్ద రెండు నెలల క్రితం కొనుగోలు చేసి చుట్టు పక్కల గ్రామాల్లో ఎక్కువ ధరకు విక్రయించాలని నిందితులు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. బత్తిని చందు తన మోటార్‌సైకిల్ సీటు కింద పెట్టుకోగా, గోల్ల వెంకటేష్ తన మోటార్ సైకిల్ పెట్రోల్ ట్యాంకర్ కవర్లో గంజాయి పెట్టుకుని ధర్మపురి వైపు వెళ్తున్నట్లు తెలిపారు. హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్దకు రాగానే సాయంత్రం వేళలో ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ ఉదయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుల వద్ద 2 కిలోల 70 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు, రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. గంజాయి విలువ రూ 40,000 వరకు ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కేసుతో సంబంధం కలిగి ఉన్న రాము అనే నిందితుడు పరారీలో ఉన్నట్లు వివరించారు. నిందితులను పట్టుకుని గంజాయి సీజ్ చేయడంలో చాకచక్యంగా వ్యవహరించిన డీఎస్పీ రఘుచందర్, ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ధర్మపురి ఎస్ఐ ఉదయ్‌కుమార్, ఏఎస్ఐ సూర్యనారాయణరాజు, హెడ్‌కానిస్టేబుల్స్ శంకర్, వెంకటయ్య, రామస్వామి, కానిస్టేబుల్ రమేష్, నవీన్‌కుమార్, రమేష్‌నాయక్, సిబ్బందిని జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్ ప్రత్యేకంగా అభినందించినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐలు ఉదయ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, ఉమాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రఘుచందర్

గడ్డి మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

జమ్మికుంట రూరల్, జూలై 5: జమ్మికుంట మండలం కాపులపల్లి గ్రామానికి చెందిన బైరెడ్డి రాంరెడ్డి (83) అనారోగ్యంతో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జమ్మికుంట పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరు నెలల నుంచి రాంరెడ్డి పక్షవాతంతో బాధపడ్డాడు. బీపీ, షుగర్ లెవల్స్ పెరిగి ఇరువై రోజుల క్రితం కళ్లు తిరిగి కిందపడ్డాడు. అనారోగ్యం వల్ల తీవ్ర మనస్థాపానికి గురైన రాంరెడ్డి ఇంట్లో నుంచి జమ్మికుంటకు వచ్చి గడ్డి మందు కొనుక్కుని పాత వ్యవసాయ మార్కెట్లో తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమారుడు సమ్మిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

భర్త వేధింపులు భరించలేక ఆత్మహత్య

జమ్మికుంట, జూలై 4: భర్త వేధింపులు తాళలేక భార్య ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జమ్మికుంటలో గురువారం చోటు చేసుకుంది. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. వీణవంక మండలం వల్బాపూర్ గ్రామానికి చెందిన మారుముళ్ల పద్మ, లక్ష్మయ్య దంపతుల కుమార్తె కావ్య (28)ను ఎల్బాక గ్రామానికి చెందిన జీడి రాజు అనే వ్యక్తికి ఇచ్చి 12ఏళ్ల క్రితం వివాహం జరిపించారు. మూడు సంవత్సరాలుగా దంపతులు ఇద్దరు పట్టణంలోని మారుతినగర్‌లో నివాసం ఉంటున్నారు. కావ్య ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడుతోందని అనుమానం పెంచుకున్న భర్త రాజు ఆమెను కొట్టడం మొదలు పెట్టాడు. వేధింపులు ఎక్కువ కావడంతో తీవ్ర మనస్థాపానికి గురైన కావ్య ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వరంగంటి రవి తెలిపారు.

పీఏసీఎస్ రాయికల్‌కు ఎక్సలెన్స్, మెరిట్ అవార్డు



అవార్డు అందుకుంటున్న సహకార సంఘ సభ్యులు

రాయికల్, జూలై 4: రాయికల్ వ్యవసాయ సహకార సంఘానికి గురువారం ఎక్సలెన్స్, మెరిట్ అవార్డు లభించింది. నేషనల్ కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాంతీయ కో ఆపరేటివ్ ఎక్సలెన్స్ మెరిట్-2023 అవార్డులో భాగంగా పీఏసీఎస్ రాయికల్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, వైస్ చైర్మన్ బేతి మోహన్‌రెడ్డి, సీఈవో రవికుమార్, సిబ్బంది తెలంగాణ రాష్ట్రంలోనే ఉత్తమ ప్రైమరీ కో ఆపరేటివ్ సొసైటీ అవార్డు అందుకున్నారు. ఈ అవార్డుతో పాటు రూ.20 వేల ప్రోత్సాహక బహుమతి కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌సీఏబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, టీఎస్‌సీఏబీ ఎండీ బి.గోపి, ఎన్‌సీడీసీ రీజనల్ డైరెక్టర్ వంశీ, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

● రాయికల్ : రాయికల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎక్సలెన్స్, మెరిట్ అవార్డును సాధించడం పట్ల జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ గురువారం సంఘం సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సంఘం సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, వైస్ చైర్మన్ బేతి మోహన్ రెడ్డి, సీఈవో రవి కుమార్ పాల్గొన్నారు.

రైస్ మిల్లుల్లో సివిల్ సప్లయీస్ అధికారుల తనిఖీ



కోరుట్ల మిల్లులో సివిల్ సప్లయ్ అధికారులు



రంగాపూర్ రైస్ మిల్లులో తనిఖీలు చేస్తున్న అధికారులు

జగిత్యాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు రైస్ మిల్లుల్లో సివిల్ సప్లయీస్ అధికారులు విస్తృతంగా సోదాలు నిర్వహించారు. రాష్ట్ర సివిల్ సప్లయ్ శాఖ కమిషనర్ చౌహాన్ ఆదేశాల మేరకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇతర జిల్లాలకు చెందిన సివిల్ సప్లయ్ అధికారులు, ఎన్‌ఫోర్స్ బృందాలు రైస్‌మిల్లుల్లో గురువారం దాడులు నిర్వహించారు. ప్రభుత్వం రైస్ మిల్లులకు సీఎంఆర్ కోసం కేటాయించిన ధాన్యం నిల్వలు సరిగా ఉన్నాయా, లేవా అన్న అంశంపై అధికారులు తనిఖీలు నిర్వహించారు. జిల్లాలోని అయిదు చోట్ల సోదాలు జరిగాయి. జిల్లాలోని తక్కలపల్లిలో గల వేణు ఇండస్ట్రీస్, మాదాపూర్‌లోని విఘ్నేశ్వర్ రైస్ మిల్, కోరుట్ల పట్టణంలోని కొత్త సురేశ్ రైస్ మిల్లు, మేడిపల్లిలోని వాసుదేవ రైస్ మిల్, పెగ్గెర్ల సాయి గణేష్ ట్రేడర్స్ రైస్ మిల్లుల్లో సివిల్ సప్లయీస్ అధికారులు సోదాలు నిర్వహించారు. రైస్‌మిల్లుల్లో గల ధాన్యం నిల్వల ఫిజికల్ వెరిఫికేషన్ జరిపారు. తనిఖీల్లో గుర్తించిన వివరాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు జిల్లా సివిల్ సప్లయి అధికారి వెంకటేశ్వర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో పెద్దపల్లి డీఎస్‌వో ప్రేమ్‌కుమార్, డీఎం శ్రీకాంత్, సిరిసిల్ల డీఎస్‌వో జితేందర్ రెడ్డి, డీఎం జితేందర్ ప్రసాద్, నిర్మల్ డీఎం నందిని, పలు మండలాల తహసీల్దార్లు, సీఐలు, ఎస్ఐలు, సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్లు, ఫుడ్ ఇన్స్‌పెక్టర్లు, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా రైస్ మిల్లుల్లో సివిల్ సప్లయి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, డీఎస్‌ఓలు, డీఎంలు సోదాలు నిర్వహించడం వ్యాపార వర్గాల్లో కలకలం రేపింది.

వెంకటయ్య కళ్లు సజీవం



వెంకటయ్య (ఫైల్)

జమ్మికుంట రూరల్, జూలై 4: జమ్మికుంట పట్టణానికి చెందిన చిదురాల వెంకటయ్య (92) బుధవారం రాత్రి అనారోగ్యంతో మృత్యువాత పడ్డాడు. సదాశయ ఫౌండేషన్ నిర్వాహకులు నేత్రదానంపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించగా వారు ముందుకు వచ్చారు. దీంతో వరంగల్ ఎల్‌వీపీ టెక్నీషియన్ సహకారంతో నేత్రాలు సేకరించి హైదరాబాద్‌లోని ఐ బ్యాంక్‌కు పంపించారు.

పెద్దమ్మ ఆలయంలో దొంగతనం

కొడిమ్యాల, జూలై 4: మండలంలోని తిప్పయ్యపల్లి గ్రామంలోని పెద్దమ్మ ఆలయంలో దొంగతనం జరిగిందని కొలకాని నర్సయ్య గురువారం మధ్యాహ్నం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 1 నుంచి 4 తేదీ ఉదయం వరకు గుర్తు తెలియని వ్యక్తులు పెద్దమ్మ ఆలయం తలుపులు పగుల గొట్టి సుమారు 15 వేల 500 రూపాయల విలువైన బంగారు ఆభరణాలు ఎత్తుకుపోయినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆదాయ పన్నుపై అవగాహన అవసరం

- హరి అశోక్‌కుమార్



కార్యక్రమంలో మాట్లాడుతున్న హరి అశోక్ కుమార్

జగిత్యాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఆదాయ పన్నుపై అవగాహన అవసరమని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యాలయంలో పెన్షనర్స్‌తో ఆదాయపన్ను అంశంపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఐటీ రిటర్న్‌లు ఫైల్ చేస్తే కలిగే ప్రయోజనాలను తెలుసుకోవాల్సిన అవసరముందన్నారు. రుణం కోసం గానీ, వీసా కోసం గానీ దరఖాస్తు చేసుకునే సమయాల్లో పన్ను రిటర్నులు ఉపయోగపడుతాయన్నారు. బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు ఇచ్చే రుణాల కోసం పన్ను రిటర్న్ రుజువు సమర్పించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా సహాయ అధ్యక్షుడు హన్మంతరెడ్డి, ప్రధాన కార్యదర్శి బొల్లం విజయ్, నాయకులు ప్రకాశ్ రావు, దిండిగల విఠల్, ఎండీ యాకూబ్, సత్యనారాయణ, శివానందం తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై యువకుడి అత్మహత్య

వీణవంక,జూలై04:మండలంలోని నర్సింగాపూర్ గ్రామనికి చెందిన దాసారపు ప్రశాంత్ (29) మద్యానికి బానిసై అత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం ప్రశాంత్ ఆరు నెలలుగా మద్యానికి అలువాటై జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ప్యాన్‌కు ఉరివేసుకొని అత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. మృతుడి అన్న వినోద్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

ప్రయాణికులను బెదిరించిన యువకుల పట్టివేత



బస్టాండ్‌లో ఆర్టీసీ సెక్యూరిటీ అదుపులో ఉన్న పాత నేరస్థులు

కరీంనగర్ క్రైం, జూలై 4: కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులను బెదిరింపులకు గురి చేస్తూ దాడులకు పాల్పడుతున్న ఇద్దరు యువకులను ఆర్టీసీ సెక్యూరిటీ పోలీసులు గురువారం పట్టుకున్నారు. పట్టుబడిన ఇద్దరు యువకులు పాత నేరస్థులు, గంజాయి సేవించేవారని ఆర్టీసీ సెక్యూరిటీ పోలీసులు తెలిపారు. పట్టుకున్న ఇద్దరిని ఒకటో టౌన్ పోలీసులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ రమణ, ఎం.సాగర్, సెక్యూరిటీ కానిస్టేబుల్ కవిత, నవీన్ పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో క్యాబ్ డ్రైవర్ అనుమానాస్పద మృతి



గాండ్ల శ్రీనివాస్(ఫైల్)

నార్సింగ్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నార్సింగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హైదర్షాకోట్ శాంతినగర్ బస్‌స్టాప్ వద్ద కారులో అనుమానస్పదస్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన గాండ్ల శ్రీనివాస్ (34) హైదర్షాకోట్ వెస్ట్రెన్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. శ్రీనివాస్ వృత్తీ రీత్యా కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శ్రీనివాస్ మూడు రోజులు నుంచి ఇంటికి రాలేదు. గురువా రం మధ్యాహ్నం శాంతినగర్ బస్‌స్టాప్ సమీపంలోని పార్కింగ్ ఏరియాలో కారులో నుంచి దుర్వాసన వస్తుండగా స్థానికులు గుర్తించారు. అనంతరం పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి పోలీసులు హుటాహుటిన చేరుకొని పరిశీలించారు. కారులో శ్రీనివాస్ మృతి చెందినట్లు కనిపించాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

కోనరావుపేట, జూలై 4 : అప్పుల బాధతో సావనపెల్లి స్వామి (37) అనే వ్యక్తి గురువారం తెల్లవారుజామున ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ధర్మారం గ్రామానికి చెందిన సావనపెల్లి స్వామి అనే వ్యక్తి తమకు 5 ఎకరాల భూమి ఉండగా అప్పుల బాధతో అటు భూమిని అమ్మి వేశారు. మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. అయినప్పటికీ వ్యవసాయంలో రాబడి రాక అప్పుల పాలయ్యాయి. అంతే కాకుండా భార్య లాస్య గుండె సంబంధించిన శస్త్ర చికిత్స కోసం కూడా అప్పులు చేశాడు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్థాపానికి గురై బుధవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని కోనరావుపేట ఎస్సై అంజనేయులు సంఘటనా స్థలానికి చేరుకొని ఆత్మహత్యకు గల కారణం పరిశీలించి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసినట్టు తెలిపారు. మృతునికి తల్లి మైసవ్వ, భార్య లాస్య, కుమారుడు శ్రీహన్ ఉన్నారు.

ఒమన్‌లో బొమ్మెన వాసి మృతి



సత్యనారాయణ(ఫైల్)

కథలాపూర్, జూలై 4 : మండలంలోని బొమ్మెనకు చెందిన పంజాల సత్యనారాయణ (54) అనే గల్ఫ్ వలసజీవి బుధవారం రాత్రి ఓమన్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం...సత్యనారాయణ రెండు సంవత్సరాల కిందట ఉపాధి నిమిత్తం ఒమన్ వెళ్లాడు. భవన నిర్మాణ కంపెనీలో కూలీగా పని చేస్తున్న సత్యనారాయణ డ్యూటీ ముగించుకుని గదికి వచ్చాడు. అప్పటి దాకా గదిలో ఉన్న సహచరులతో మాట్లాడిన సత్యనారాయణ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. మృతునికి భార్య, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. మరణవార్త విన్న కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతదేహాన్ని స్వగ్రామానికి తొందరగా పంపించే ఏర్పాట్లు చేయాలని, మృతుని కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందించాలని ప్రజాప్రతినిధులు కోరారు.

వ్యవసాయ బావుల మోటారు దొంగల అరెస్టు

ఇల్లంతకుంట, జూలై 4: మండలంలోని తాళ్లపెల్లి గ్రామానికి చెందిన నాంపెల్లి కనుకయ్య అనే రైతుకు చెందిన వ్యవసాయ మోటారును దొంగిలించిన వారిని పట్టుకొని అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం గురువారం తాళ్లపల్లి గ్రామ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వడ్లూరు గ్రామానికి చెందిన బిగుళ్ళ శ్రావణ్, ముత్తన్నపేట గ్రామానికి చెందిన కనగాండ్ల అజయ్‌ను పట్టుకొని విచారించగా వ్యవసాయ మోటార్‌ను అపహరించి గుండ్లపల్లి గ్రామానికి చెందిన వనరాసి కొమురయ్యకు అమ్మినట్లు అంగీకరించారు. వీరి వద్ద నుండి వ్యవసాయ మోటార్‌తో పాటు ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకొని నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

శంకరపట్నం, జూలై 4: శంకరపట్నం మండలం వంకాయగూడెం గ్రామంలో టాస్క్‌ఫోర్స్, కేశవపట్నం పోలీసులు గురువారం 40క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. వంకాయగూడెం గ్రామానికి చెందిన ధరావత్ శ్రీను, దీరావత్ హరాలాల్, ధనావత్ శ్రీను ఇళ్లలో నిల్వ చేసిన 40క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపారు.

ధాన్యం కమీషన్ డబ్బుల కింద ఫర్టిలైజర్

● డీసీఎంఎస్‌లో ఎరువుల అక్రమ అమ్మకాలపై ఏసీబీ విచారణ ● లక్ష రూపాయల లంచంతో పట్టుబడిన మేనేజర్, క్యాషియర్

కరీంనగర్ క్రైం, జూలై 4: జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)లో ధాన్యం కొనుగోలు, ఫర్టిలైజర్ అమ్మకాలపై ఏసీబీ పోలీసులు లోతుగా విచారణ జరుపుతున్నారు. వరి, మొక్కజొన్న ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా డీసీఎంఎస్‌కు వచ్చిన కమీషన్ డబ్బుల్లో 50 శాతం కేంద్రాల నిర్వహణ కాంట్రాక్టర్‌కు బిల్లు చెక్ రూపంలో చెల్లించాల్సి ఉంది. కానీ అందుకు విరుద్ధంగా ఫర్టిలైజర్‌ను డీసీఎంఎస్ మేనేజర్ రేగులపాటి వెంకటేశ్వర్‌రావు బలవంతంగా కాంట్రాక్టర్ కావటి రాజుకు అంటగట్టి అక్రమాలకు పాల్పడ్డట్లు ఏసీబీ అధికారుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఫర్టిలైజర్ ఇచ్చేందుకు లైసెన్స్ కలిగి ఉండాలని, కాంట్రాక్టర్ చేత బలవంతంగా వ్యవసాయశాఖ నుంచి అతడి ఊరిలో ఫర్టిలైజర్ దుకాణం నిర్వహణకు లైసెన్స్ తీయించిన తరువాత ఫర్టిలైజర్‌ను ఇచ్చినట్లు బాధిత కాంట్రాక్టర్ తెలిపారు. కరీంనగర్ డీసీఎంఎస్ మేనేజర్ రేగులపాటి వెంకటేశ్వర్‌రావు, క్యాషియర్ సుదగోని కుమారస్వామిలు డీసీఎంఎస్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ కాంట్రాక్టర్ వాకటి రాజు వద్ద లక్ష రూపాయలు లంచం తీసుకుంటుండగా గురువారం ఏసీబీ పోలీసులు అరెస్టు చేశారు. 2018-19 సీజన్ నుంచి 2023-24 సీజన్ వరకు ధాన్యం కమీషన్ డబ్బులు మొత్తం 90 లక్షల 16 వేల 652 రూపాయలు కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సి ఉంది. ఈ డబ్బులు(పెండింగ్ బిల్లులు) కోసం కాంట్రాక్టర్ తిరిగి వేసారిపోయాడు. కాంట్రాక్టర్‌కు చెక్ రూపంలో చెల్లించాల్సిన డీసీఎంఎస్ మేనేజర్ నిబంధనలకు విరుద్ధంగా అతడికి 20 లక్షల 91 వేల 500 రూపాయల విలువ కలిగిన ఫర్టిలైజర్‌ను ఇచ్చాడు. మరో 69 లక్షల 25 వేల 152 రూపాయల ఫర్టిలైజర్‌ను కమీషన్ డబ్బుల కింద ముట్టజెప్పేందుకు ఒప్పందం కుదరగా ఇందుకు లంచంగా 15 లక్షల రూపాయలు మేనేజర్‌కు కాంట్రాక్టర్ ఇవ్వాలని ఒప్పందం కుదిరింది. ఈ సమయంలోనే మొదటి లక్ష రూపాయలు తీసుకుంటున్న క్రమంలో మేనేజర్, క్యాషియర్‌లను ఏసీబీ పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కాగా ఏసీబీకి పట్టుబడిన డీసీఎంఎస్ మేనేజర్ వెంకటేశ్వర్‌రావు ఆగస్టు నెలలో పదవీ విరమణ చేయనున్నారు. తనకు రావాల్సిన కమీషన్ బిల్లు కోసం 5 సంవత్సరాల నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నానని, అప్పులు తెచ్చి ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహించానని బాధితుడు కావటి రాజు తెలిపారు. తన కమీషన్ డబ్బులు డీసీఎంఎస్‌కు వచ్చినప్పటికీ చెక్ ఇవ్వకుండా లంచం డబ్బుల కోసం తనకు ఫర్టిలైజర్‌ను అంటగట్టారని వాపోయాడు. ఫర్టిలైజర్ బస్తాకు 15 రూపాయలు అదనంగా లెక్కగట్టారని, తన ఊరికి అదనంగా మరో 15 రూపాయల రవాణా చార్జి అయిందని, ఈ విధంగా బస్తాకు 30 రూపాయల వరకు నష్టం వాటిల్లిందని అతడు వాపోయాడు.

● కరీంనగర్ రీజియన్ ఏసీబీ డీఎస్పీ వి.రమణమూర్తి, బాధితుడు కావటి రాజు తెలిపిన వివరాల ప్రకారం జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణను ప్రైవేట్ వ్యక్తి అయిన పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన కావటి రాజు అనే కాంట్రాక్టర్ నిర్వహిస్తున్నాడు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ ద్వారా డీసీఎంఎస్‌కు క్వింటాల్ ధాన్యానికి 32 రూపాయల కమీషన్ వస్తుండగా అందులో నుంచి 50 శాతం అనగా 16 రూపాయలు కేంద్రాల నిర్వహణ కాంట్రాక్టర్ కావటి రాజుకు చెల్లించాలని ఒప్పందం ఉంది. దీని ప్రకారం 2018 నుంచి 2023 వరకు వరి, మొక్కజొన్న ధాన్యం సేకరణపై కాంట్రాక్టర్ రాజుకు మొత్తం 90 లక్షల 16 వేల 652 రూపాయలు రావాల్సి ఉంది. కాంట్రాక్టర్ రాజుకు డబ్బులు ఇవ్వాలంటే లంచం కోసం డీసీఎంఎస్ మేనేజర్ వెంకటేశ్వర్‌రావు వేధిస్తున్నాడు. దీంతో విసిగిపోయిన కాంట్రాక్టర్ రాజు ఏసీబీని ఆశ్రయించాడు. లంచం డబ్బులు తీసుకుంటూ పట్టుబడిన మేనేజర్ వెంకటేశ్వర్‌రావు, క్యాషియర్ కుమారస్వామిలను అరెస్టు చేశామని, శుక్రవారం కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరు పరచనున్నట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు.



ఏసీబీకి పట్టుబడ్డ జూనియర్ అసిస్టెంట్ కుమారస్వామి, మేనేజర్ వేంకటేశ్వర్‌రావు



మాట్లాడుతున్న ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి , బాధితుడు రాజుయాదవ్

నేతన్నలు ఆత్మహత్యలు చేసుకోవద్దు

● సీపీఎం కేంద్ర కమిటీ పోలీట్ బ్యూరో సభ్యుడు చెరుపల్లి సీతారాములు

సిరిసిల్ల రూరల్, జూలై 4: నేతన్నలు ఉపాధి లేదంటూ ధైర్యం కోల్పోయి ఆత్మహత్యలు చేసుకుని కుటుంబాలను రోడ్డున పడేయవద్దని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం నేతన్నల జీవితాలతో రాజకీయం చేయకుండా వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి కార్మికులకు ఉపాధి కల్పించాలని మాజీ ఎమ్మెల్సీ, సీపీఎం కేంద్ర కమిటీ పోలిట్ బ్యూరో సభ్యులు చెరుపల్లి సీతారాములు కోరారు. సిరిసిల్ల పట్టణంలో గురువారం సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మూషం రమేష్, కూరపాటి రమేష్‌లతో కలిసి ఇటీవల ఆత్మహత్య చేసుకున్న నేతన్న కుటుంబాలను పరామర్శించారు. వారికి సీపీఎం పార్టీ అండగా ఉంటుందని ప్రభుత్వం వారిని ఆదుకునేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తామని అన్నారు. ప్రభుత్వం వెంటనే ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. చేనేత జౌళి శాఖ కార్యాలయం వద్ద జరిగిన కార్మికుల సమావేశంలో కార్మికులతో మాట్లాడారు. ఆత్మహత్యలు చేసుకోవద్దని పోరాటాల ద్వారానే అన్ని సాధించుకుంటామని అన్నారు. అనంతరం చేనేత జౌళి శాఖ ఏడీ మిట్టకోల సాగర్‌ను కలిసి కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. అనంతరం సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులో నిర్మిస్తున్న అపెరల్ పార్కులో వర్కర్ టు ఓనర్ షెడ్లను పరిశీలించారు. అనంతరం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ప్రధానంగా నాలుగు సమస్యల వలన పూర్తిగా సంక్షోభంలోకి కూరుకపోయి మొత్తం పరిశ్రమలు మూతపడ్డాయని అన్నారు. ప్రధాన సమస్యలు బతుకమ్మ చీరల తయారీ ఆర్డర్లు ప్రభుత్వం రద్దు చేయడంతో పాటు కరెంటు సబ్సిడీ తొలగించడం, మార్కెట్‌లో ప్రస్తుతం తయారు చేసే వస్త్రానికి డిమాండ్ లేకపోవడంతో పాటు పాత బకాయిలు విడుదల చేయకపోవడం వలన వస్త్ర పరిశ్రమలో సంక్షోభం ఏర్పడడంతో పాటు కార్మికులకు ఏడు నెలలుగా ఉపాధి లేకుండా పోయిందని అన్నారు. కార్మికులకు సరైన ఉపాధి లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక ఇప్పటివరకు 9 మంది కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని అన్నారు. ప్రభుత్వం వెంటనే దీన్ని రాజకీయ కోణంగా చూడకుండా సమస్యలను పరిష్కరించాలని అన్నారు. నూతన పరిశ్రమలు తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. పవర్‌లూమ్ పరిశ్రమలకు ఉచిత విద్యుత్ అందించాలని లేకుంటే గతంలో మాదిరిగా అన్ని కేటగిరీలకు విద్యుత్ సబ్సిడీ కొనసాగించాలని అన్నారు. బతుకమ్మ చీరల ఆర్డర్లు, లేకుంటే జనతా వస్త్రాల పథకం ద్వారా ఒక చీర, ఒక పంచా సిరిసిల్లలో ఉత్పత్తి చేయించడంతో పాటు వర్కర్ టు ఓనర్ వెంటనే పూర్తిచేసి కార్మికులను యజమానులు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు యారన్ సబ్సిడీతో పాటు బతుకమ్మ చీరల పెండింగ్ బకాయిలను విడుదల చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు కోడం రమణ, సిరిమల్లె సత్యం జవ్వాజీ విమల, సూరం పద్మ, అన్నల్‌దాస్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మహత్య చేసుకున్న కుటుంబాన్ని పరామర్శిస్తున్న సీతారాములు

ఫ్లెక్సీల తొలగింపుపై ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆగ్రహం

జగిత్యాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాల్లో అభిమానులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మున్సిపల్ అధికారులు తొలగించడంపై ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి గురువారం ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని ఎనిమిదో వార్డులో గల బుడిగ జంగం కాలనీలో బోనాల పండుగ సందర్భంగా పలువురు అభిమానులు జీవన్‌రెడ్డి ఫొటోతో కూడిన ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. సంబంధిత ఫ్లెక్సీలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో పాటు ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ ఇతరుల ఫొటోలను పొందుపరిచారు. అయితే సదరు ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన కొద్దిసేపటికే మున్సిపల్ సిబ్బంది తొలగించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సంబంధిత మున్సిపల్ అధికారులకు సెల్‌ఫోన్ ద్వారా మాట్లాడి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి. అసలు తనను జగిత్యాలలో ఉండనిస్తారా...వెళ్లగొడు తారా అని మున్సిపల్ అధి కారులను ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రశ్నించి అసహనం వ్యక్తం చేశారు. జగిత్యాల కాంగ్రెస్‌లో చోటు చేసుకున్న గ్రూప్ రాజకీయాలు ఫ్లెక్సీ వివాదానికి కారణంగా తెలుస్తోంది.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంగా గుర్తించాలి

- సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ

జగిత్యాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణ నిరుపేద వర్గాలకు గృహ వసతి కోసం తలపెట్టిన ఇళ్ల నిర్మాణాల సముదాయాన్ని యథావిధిగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ సముదాయంగా మార్చాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి గురువారం జగిత్యాలకు చెందిన ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి లేఖను రాశారు. గతంలో జరిగిన ఇందిరమ్మ గృహ నిర్మాణాలను మరిపించాలనే భావనతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేసీఆర్ డబుల్ బెడ్ రూమ్ ఇంటి నిర్మాణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం బాధాకరమన్నారు. ప్రస్తుత ప్రభుత్వం సంబంధిత ఇళ్ల సముదాయాలను ఇందిరమ్మ ఇళ్ల సముదాయంగా పిలువబడే విధంగా రాష్ట్రప్రభుత్వ గృహ నిర్మాణ శాఖతో తగుచర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు. ఇళ్ల నిర్మాణాలకు మంజూరు చేసే రూ. 5 లక్షలకు తోడు ఇళ్ల నిర్మాణానికి కావాల్సిన స్థల సేకరణకు అదనపు నిధుల వెచ్చింపుతో కార్యక్రమాన్ని అమలు చేయాలని లేఖలో కోరారు.

మొక్కలు నాటిన జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత


మొక్కనాటి నీరుపోస్తున్న జడ్పీచైర్‌పర్సన్

జగిత్యాలరూరల్, జూలై 4: ఐదేళ్ల పదవీకాలం గురువారంతో ముగిసిన సందర్భంగా జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతసురేష్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ గ్రామీణ ప్రాంతాల్లో పచ్చదనం, పరిశుభ్రతపై దృష్టిపెట్టి హరితహారం అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీసీఈవో గౌతంరెడ్డి, డిప్యూటీ సీఈవో రఘువరణ్, పీఆర్ ఈఈ రెహమాన్, జిల్లాపరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం

రాయికల్, జూలై 4: రాయికల్ పట్టణ కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో గురువారం కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. హిందువులపై, హిందూ దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేసి హిందూ మనోభావాలు దెబ్బతీసేలా చేసిన రాహుల్ గాంధీ వెంటనే హిందువులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుర్మ మల్లారెడ్డి, పట్టణ దళిత మోర్చా అధ్యక్షుడు బన్న సంజీవ్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు తిరుపతినాయక్, ప్రధాన కార్యదర్శులు ఆకుల మహేష్, బొడుగం శ్రీకాంత్‌రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు ఆశన్న పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

రాయికల్, జూలై 4: విద్యార్థి దశ నుంచే ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకుని చదివితే ఎంచుకున్న గమ్యాన్ని త్వరగా చేరుకోగలమని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ ఫౌండర్ బాలలత అన్నారు. పట్టణంలోని విస్డమ్ హైస్కూల్‌ను గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ రెండుకాళ్లు పని చేయకున్నా రెండుసార్లు తాను ఐఏఎస్ పాస్ అయ్యానని, సంకల్ప శుద్ధి ఉంటే మీరు కూడా అత్యున్నత స్థానానికి వెళ్లొచ్చని సూచించారు. అనంతరం హైస్కూల్ విద్యార్థులకు ఐఏఎస్ కావాలంటే ప్రిపరేషన్ ఎలా చేసుకోవాలో మెళకువలు తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎద్దండి ముత్యంపు రాజు రెడ్డి, డైరెక్టర్ నివేదిత రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

శానిటేషన్ పనులను నిత్యం చేపట్టాలి

మెట్‌పల్లి, జూలై, 4 : మెట్‌పల్లి మున్సిపల్ పరిధిలోని శానిటేషన్ పనులను నిత్యం చేపట్టాలని కమిషనర్ మోహన్ సూచించారు. గురువారం పట్టణంలోని మురికి కాలువలు, రోడ్ల, ముంపు ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం పట్టణంలోని పలువార్డుల్లోని మురికి కాలువలు, రోడ్లను పారిశుధ్య కార్మికులతో శుభ్రం చేయించారు. పట్టణంలోని స్టేడియంలోని పిచ్చిమొక్కలు తొలగించాలని, గుంతలలో మొరము పోయాలని సిబ్బందికి ఆదేశించారు. ఆయన వెంట ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, ముజీబ్, నిజాం, నరేష్, అశోక్, పారిశుధ్య కార్మికులు, తదితరులు ఉన్నారు.

పదెకరాల లోపు వారికే రైతు భరోసా వర్తింపజేయాలి

గొల్లపల్లి, జూలై 4: పదెకరాల లోపు సాగు చేస్తున్న భూమికి రైతు భరోసా పథకాన్ని వర్తింపజేయాలని మెజార్టీ రైతులు తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. గురువారం గొల్లపల్లి మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో చైర్మన్ డాక్టర్ సుంకిశాని రాజసుమన్ రావు అధ్యక్షతన రైతు భరోసా పథకంపై ప్రత్యేక సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సంఘం పరిధిలోని రైతులు హాజరయ్యారు. ఈ సమావేశం ప్రత్యేక అధికారి, మంచిర్యాల జిల్లా సహకార సంఘం అధికారి రాంమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ డా. రాజసుమన్ రావు మాట్లాడుతూ ప్రభుత్వం నూతన ప్రభుత్వం రైతుభరోసా పథకంపై రైతుల అభిప్రాయాలను సేకరిస్తోందన్నారు. రైతుల అభిప్రాయాలతో కూడిన నివేదికను రూపొందించి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని ఎఈవో బెజ్జంకి రాంసుధాకర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో ప్యాక్స్ పాలకవర్గం సభ్యులు, అడాప్షన్ అధికారి రాములు, సుద్దాల స్వరూప, శైలజ, మారంపల్లి వెంకటేష్, వావిలాల పవన్, రాముల తదితర సిబ్బందితో పాటు రైతులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

మెట్‌పల్లి, జూలై, 4: బహిరంగ ప్రదేశాల్లో, అనుమతులు లేని దాబాల్లో మద్యం సేవిస్తే చర్యలు తీసుకొబడనని మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం పట్టణ శివారులో ఉన్న దాబాలపై ఎస్సై చిరంజీవితో కలిసి దాడులు నిర్వహించారు. అనుమతులు లేకుండా దాబాలు ఏర్పాటు చేసి సిట్టింగ్‌లు చేయించి మద్యం సేవించడానికి సహకరించిన, మద్యం సేవించిన వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. దాబా నిర్వహకులు, మద్యం సేవిస్తున్న వారికి అవగాహన కల్పించారు.

● పట్టణంలోని వెల్లుల్ల రోడ్డులోని ఓ కిరాణంలో మద్యం పట్టుకున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. డీఎస్పీ ఆదేశాల మేరకు పట్టణంలో అక్రమంగా మద్యం విక్రయాలు జరుపుతన్న షాపులపై సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సైలు దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో హరిప్రియా కిరాణంలో మద్యం విక్రయాలు జరుపుతున్నరానే సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. దాడుల్లో సుమారు ఆరు వేల రూపాయల విలువ గల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయాలు చేస్తున్న కిరాణం షాపు యజమాని ధనలకోట లక్ష్మీనర్సయ్యపై కేసు నమోదు చేశారు.

'నీట్'ను రద్దు చేసి తిరిగి నిర్వహించాలి

కోరుట్ల, జూలై 4: కేంద్ర విద్యా శాఖ మంత్రిని పదవి నుంచి ఎన్‌డీఏ ప్రభుత్వం తొలగించి నీట్ పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని ఏఐఎస్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు సమీర్ డిమాండ్ చేశారు. గురువారం ఏఐఎస్‌ఎఫ్ దేశవ్యాప్త బంద్ పిలుపు మేరకు పట్టణంలోని విద్యాసంస్థల బంద్‌కు సహకరించాలని కోరుతూ తరగతుల బహిష్కరణను నిర్వహించారు. ఈ సందర్భంగా పలు విద్యాసంస్థల వద్ద ఏఐఎస్‌ఎఫ్ నాయకులు ధర్నా నిర్వహించి నీట్ పరీక్షలో జరిగిన అన్యాయాన్ని వివరించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు అమీర్, ముసెబ్, పాషా, పవన్, ఉమేష్, శ్రీరాం పాల్గొన్నారు.

కథలాపూర్: నీట్ పరీక్ష లీకేజీ విషయంలో కేంద్రం స్పందించక పోవడాన్ని నిరసిస్తూ అఖిల పక్ష విద్యార్థి సంఘాలు గురువారం ఇచ్చిన భారత్ బంద్ పిలుపు కథలాపూర్‌లో విజయవంతమైంది. మండల కేంద్రంలో మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల, కస్తూర్బాగాంధీ పాఠశాల, జిల్లా పరిషత్ హైస్కూల్ బంద్ పాటించాయి. ఎస్‌ఎస్‌యుఐ నాయకులు పాఠశాలలను బంద్ చేయడంతో విద్యార్థులు ఇళ్లకు వెళ్లిపోయారు. అనంతరం ఎస్‌ఎస్‌యుఐ నాయకులు దొమ్మాటి అర్జున్‌గౌడ్ హెచ్‌ఎంకు వినతిపత్రం అందించారు.

దొడ్డి కొమురయ్య పోరాటాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

- కలెక్టర్ సత్యప్రసాద్




తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్యకు నివాళులర్పిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోదుడు దొడ్డి కొమురయ్య సేవలు చిరస్మరణీయమన్ని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. గురువారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని అన్నారు. కొమురయ్య పోరాట ప్రతిమను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

● తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోదుడు దొడ్డి కొమురయ్యను ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని విజయపుర్తి కాలనీలోగల దొడ్డి కొమురయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ పాల్గొన్నారు.

● దొడ్డి కొమురయ్య పోరాటం స్పూర్తిదాయకమని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని విజయపురి కాలనీలో గల దొడ్డి కొమురయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్స్ కూసరి అనిల్ కుమార్, కోరె గంగమల్లు, యూత్ నాయకులు కత్రోజ్ గిరి, కురమ సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● పోరాటయోదుడు దొడ్డి కొమురయ్య అని జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ అన్నారు. గురువారం దొడ్డి కొమురయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జగిత్యాల కురమ సంఘం నాయకులు పుల్ల మల్లయ్య, నాయకులు దయ్యాల మల్లారెడ్డి, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: తెలంగాణ రైతంగా సాయుధ పోరాటయోధుడు దొడ్డి కొమురయ్య జీవితచరిత్రను పాఠ్య పుస్తాకాల్లో చేర్చాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా పట్టణంలోని విగ్రహానికి ఉమ్మడి జిల్లా మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ-రాజేందర్, కురుమ సంఘం సభ్యులతో కలిసి పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కురుమ సంఘం అధ్యక్షుడు కోటా రమేష్, పెద్ద సాయన్న, కోరే రమేష్, నర్సయ్య, రమేష్, మల్లేష్, చిన్న గంగారం, గంగారం, సురేష్, మల్లేష్, కోడె రవి, కోడే చిన్నగంగారం, కోట మహేష్, సభ్యులు పాల్గొన్నారు.

గొల్లపల్లి: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, తెలంగాణ తొలి ఉద్యమ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా గొల్లపల్లి మండల కేంద్రంలో కొమురయ్య విగ్రహానికి వైస్ ఎంపీపీ ఆవుల సత్తయ్య పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో కచ్చు కోమురయ్య, మ్యాదరి రమేష్, జేరిపోతుల నరేష్, కోమల్ల జలేంధర్, కాల్వ రాజయ్య, కలికోట సత్యా, చౌట్‌పెల్లి తిరుపతి, సామల వీరాస్వామి, ఆవుల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



దొడ్డి కొమురయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్

స్థానిక సంస్థలను బలోపేతం చేస్తాం: ఎమ్మెల్సీ

జగిత్యాలరూరల్, జూలై 4: స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు ప్రాధాన్యం కల్పించి బలోపేతం చేస్తామని ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల మండలంలోని ఎంపీపీ, ఎంపీటీసీలతోపాటు పాలకవర్గం ఐదేళ్లకాలం పూర్తికావడంతో జగిత్యాల ఎంపీపీ కార్యాలయంలో గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పదవీకాలం పూర్తిచేసుకున్న ఎంపీటీసీలను ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి శాలువాతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో ఎంపీటీసీలకు ప్రాధాన్యం కల్పించడానికి కృషి చేస్తానని అన్నారు. గ్రామపంచాయతీల్లో సర్పంచులు అభివృద్ధి పనులు చేసి బిల్లులు రాకపోవడంతో ఆర్థికంగా చితికిపోయారని వెంటనే వారి బిల్లులు విడుదల చేసేవిధంగా ప్రభుత్వానికి నివేదిస్తానని తెలిపారు. పదవిలో ఉన్నాలేకున్నా ప్రజాసేవ చేసినప్పుడే ప్రజాప్రతినిధులకు గుర్తింపు వస్తుందన్నారు. గ్రామాల్లో ప్రొటోకాల్‌కే పరిమితమయ్యామని పలువురు ఎంపీటీసీలు తన దృష్టికి తీసుకువచ్చారని ఎంపీటీసీలకు నిధులు, నియామకాల్లో ప్రాధాన్యం కల్పించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం చేస్తానని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో జగిత్యాల మండల ప్రత్యేకాధికారి రాజ్‌కుమార్, ఎంపీపీ ములాసపు లక్ష్మీ, జడ్పీటీసీ మహేష్, ఎంపీడీవో విజయలక్ష్మీ, తహసీల్దార్ వరందన్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీలు శేఖర్‌రెడ్డి, మల్లారెడ్డి, ఎంపీటీసీలు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

● జడ్పీటీసీ, ఎంపీటీసీలకు సన్మానం

కథలాపూర్: జడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీకాలం గురువారంతో ముగయడంతో మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జవ్వాజి రేవతి వారిని సన్మానించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ నాగం భూమయ్య, ఎంపీపీ రేవతి మాట్లాడుతూ ఐదేళ్ల కాలంలో ప్రజల సహకారంతో ఎంతో అభివృద్ధి చేశామని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం నుంచి నిధులు తెప్పించి సీసీ రోడ్లు, కుల సంఘాల భవనాలు, మురికి కాలువలు, పాఠశాల అదనపు గదులు, బోర్లు వంటి అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఈ సందర్భంగా మండల పాత్రికేయులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ గంద్ర కిరణ్‌రావు, ఎంపీడీఓ శంకర్, సిబ్బంది, ఎంపీటీసీలు ఉన్నారు.


కథలాపూర్‌లో జడ్పీటీసీ, ఎంపీటీసీలను సన్మానించిన ఎంపీపీ

రాయికల్: మండలంలోని ఇటిక్యాల గ్రామంలో పదవీకాలం పూర్తి చేసుకున్న ఎంపీటీసీ కొమ్ముల రాధఆదిరెడ్డికి గ్రామపంచాయతీ ఆవరణలో గురువారం గ్రామ నాయకులు ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు చేసిన సేవలను కొనియాడారు. ఎంపీటీసీ రాధఆదిరెడ్డి దంపతులు అందరితో కలిసిమెలిసి ఉంటూ, ఎలాంటి ఆటంకాలు లేకుండా అన్ని విధాలుగా సంపూర్ణ సహాయ సహకారాలు అందించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మహిపతిరెడ్డి, మాజీ ఎంపీపీ కాటిపెల్లి గంగారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ చంద్రశేఖర్, గ్రామ సేవా సమితి అధ్యక్షుడు కంటె విష్ణు, నాయకులు సామల వేణు, రొట్టె శ్రీధర్, మరిపల్లి శ్రీనివాస్ గౌడ్, అనుపురం చిన్న లింబాద్రి గౌడ్, కొక్కు శేఖర్, బొడుగం అంజిరెడ్డి, సుంకిసాల సత్తయ్య, మారంపల్లి గంగాధర్, అనంత స్వామి, ముత్తయ్య, సురకంటి చిన్న రాజారెడ్డి, ఎద్దండి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

హలో మాదిగ..చలో ఈదుముడి సభను జయప్రదం చేయండి

గొల్లపల్లి, జూలై 4: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా నాగలుప్పలపాడు మండలం ఈదుముడి గ్రామంలో ఎస్సీ వర్గీకరణ చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 7న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తలపెట్టిన హలో మాదిగ..చలో ఈదుముడి మహాసభకు జిల్లా నలుమూలల నుంచి మాదిగలు పెద్ద ఎత్తున తరలివచ్చి సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెవులమద్ది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం గొల్లపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద హలో మాదిగ. ఛలో ఈదుముడి సభకు సంబంధించిన కరపత్రాలను ఎమ్మార్పీఎస్ నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు చెవులమద్ది సంతోష్, నాయకులు నక్క వినేష్, గంగాధర్, రాజయ్య, పోచయ్య, చంద్రయ్య, గంగయ్య, గంగామల్లు, రమేష్, పోచయ్య, ఆశయ్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రాయికల్, జూలై 4: రాయికల్ పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 2013-14 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు గురువారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రాయికల్ పట్టణంలోని పీవీఎస్ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆనందంగా గడిపారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకుడు శ్రీనివాస్‌కు డాక్టరేట్



జగిత్యాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తున్న రాపర్తి శ్రీనివాస్‌కు డాక్టరేట్ లభించింది. సిద్దిపేట జిల్లాలో ప్రముఖ తత్వకవిగా కొనియాడబడిన వర కవి సిద్దప్ప సాహిత్యనుశీలన అను అంశంపై పరిశోధన వ్యాసం సమర్పించినందుకు గానూ ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓరియంటల్ లాంగ్వేజస్) పీహెచ్‌డీ ప్రకటించింది. ఈయనకు డాక్టరేట్ రావడంపై ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యనారాయణ, నాయకులు రామగిరి శ్రీనివాస్, రామగిరి సుధాకర్, రమేశ్ హర్షం వ్యక్తం చేశారు.

మొక్కలు నాటిన అధికారులు

మల్యాల, జూలై 4: వనమహోత్సవంలో భాగంగా మండలంలోని సర్వాపూర్‌లో గురువారం అధికారులు మొక్కలు నాటారు. రహదారికిరువైపులా ఎంపీడీవో స్వాతి, పంచాయతీ కార్యదర్శి బాబు తదితరులు మొక్కలు నాటి ప్రతి ఒక్కరూ నాటాలని సూచించారు. అనంతరం వన నర్సరిని, ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పనులు పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

జువ్వాడి నర్సింగరావు జన్మదిన వేడుకలు


కోరుట్లలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోరుట్ల, జూలై 4: కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, సీనియర్ నాయకుడు జువ్వాడి నర్సింగ రావు జన్మదిన వేడుకలను పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణంలోని వివిధ వార్డుల్లో కాంగ్రెస్ నాయకులు, అభిమానులు నర్సింగరావు జన్మదిన వేడుకలను నిర్వహించారు. పట్టణంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజల ను నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్స్ ఎంబేరి నాగభూషణం, అన్వర్, మోర్తాడ్ లక్ష్మీనారాయణ, అడెపు కమల-మధు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: మండలంలో జరిగిన వేడుకల్లో మాజీ జడ్పీటీసీ సభ్యురాలు కొంత రాజు-రాజం, నాయకులు గంగాధర్‌గౌడ్, సత్యానారాయణ గౌడ్, సంజీవరెడ్డి, కాశిరెడ్డి, నర్సరెడ్డి, మహిపాల్‌రెడ్డి, శంకర్, వెంకటేష్‌గౌడ్, లింబాద్రి, రవీందర్‌రెడ్డి, నర్సయ్య పాల్గొన్నారు.

● కోరుట్ల మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన మహ్మమద్ నసీర్ ఆధ్వర్యంలో ఖతర్ దేశంలో నర్సింగరావు జన్మదిన వేడుకలను నిర్వహించారు.

మెట్‌పల్లి: పట్టణంలో కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. అనంతరం నాయకులు, యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి తుమ్మనపల్లి రాంప్రసాద్, కౌన్సిలర్లు యామ రాజయ్య, మర్రి సహదేవ్, కోఆప్షన్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మండలంలోని సిర్పూర్‌లో మాజీ సర్పంచ్ నల్ల బాపురెడ్డి ఆధ్వర్యంలో నాయకులు మొక్కలు నాటారు. మండల కేంద్రంలోని భారత మాత విగ్రహం వద్ద మాజీ జడ్పీటీసీ ఏలాల జలపతిరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుడుంబా తయారు చేస్తే కఠిన చర్యలు: డీఎస్పీ

మెట్‌పల్లి, జూలై, 4: గుడుంబాను తయారు చేసినా, అక్రమంగా రవాణా చేసినా, విక్రయాలు జరిపినా కఠినచర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఉమామ హేశ్వర్‌రావు, ఎక్సైజ్ జిల్లా ఎస్పీ సత్యనారాయణ హెచ్చరించారు. గురువారం మెట్‌పల్లి డీఎస్పీ కార్యాలయంలో డివిజన్ పోలీసు, ఎక్సైజ్ శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి గుడుంబా, సారారహిత తెలంగాణగా తీర్చిదిద్దడానికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుడుంబా తయారీదారులు, విక్రయదారులు, సరఫరా చేసే వారిని ఉపేక్షించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ వినోద్‌రాథోడ్, జగిత్యాల ఎస్సై సర్వేశ్వరరావు, మెట్‌పల్లి సీఐ నిరంజన్ రెడ్డి, ఎస్సైలు చిరంజీవి, అనిల్‌కుమార్, కిరణ్‌కుమార్, శ్యాంరాజ్, సునేషబాబు పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే


కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్

మెట్‌పల్లి రూరల్, జూలై 4: మండలంలోని పలు గ్రామాల్లోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అందజేశారు. గురువారం మండలంలోని వెల్లుల్ల, జగ్గసాగర్, రామలచ్చక్కపేట, ఆత్మనగర్, ఆత్మకూర్, కొండ్రికర్ల, కోనరావుపేట, పెద్దాపూర్, చౌలమద్ది, వేంపేట గ్రామాకు చెందిన 32 మంది లబ్ధిదారులకు స్థానిక నాయకులతో కలిసి లబ్ధిదారుల ఇంటికి వెళ్లి చెక్కులను అందజేశారు. గ్రామాల్లో కాలినడకన పర్యటించి వానాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలతో ఇబ్బందులు పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, నాయకులు గడ్డం రాజారెడ్డి, పుల్ల జగన్‌గౌడ్, డాకూరి వెంకటేష్, మెండే రమేష్, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

● యువత అందరికీ ఆదర్శంగా ఉండాలి

యువత గ్రామాల్లో గర్వించే విధంగా సామాజిక సేవా కార్యక్రమాలలో పాలుపంచుకుంటూ అందరికీ ఆదర్శంగా ఉండాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. ఎంపీ జోగినిపల్లి సంతోష్‌కుమార్ నిధులు రూ. 5లక్షలతో మండలంలోని జగ్గాసాగర్ గ్రామంలో జిమ్‌ను ఏర్పాటు చేయడానికి గురువారం స్థానిక నాయకులతో కలిసి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం గ్రామానికి చెందిన రంగు మహేష్ తయారు చేయించిన జర్సీలను ఎమ్మెల్యే ఆవిష్కరించి క్రీడాకారులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, నాయకులు పుల్ల జగన్‌గౌడ్, డాకూరి వెంకటేష్, ముదాం నరసింహులు, సార్ల మోహన్‌రెడ్డి, యువత, క్రీడకారులు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

గొల్లపల్లి: ఈ నెల 6న ప్రపంచ జూనోసిస్ దినాన్ని పురస్కరించుకుని పశువైద్య కార్యాలయం ఆవరణలో కుక్కలకు ఉచిత ఆంటీ రాబిస్ టీకాలు వేసే ఉచిత పశువైద్య శిబిరంను నిర్వహిస్తున్నట్లు మండల పశువైద్యాధికారి డా. రవీందర్ పేర్కొన్నారు.

మల్యాల: బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైన మండలంలోని పోతారం గ్రామానికి చెందిన ఆరే సంజనను గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో గ్రామ ప్రత్యేక అధికారి జ్ఞానేశ్వర్, హెచ్‌ఎం. జయసింహారావు, కంటె అరుణ్ తదితరులు శాలువతో సన్మానించి అభినందించారు.

- మల్యాల మండలంలోని రామన్నపేట శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకున్నట్లు ఎస్సై అబ్దుల్‌రహీం తెలిపారు. పట్టుబడిన వారి వద్ద రూ.6780 నగదు సీజ్‌తో పాటు కేసు నమోదు చేశారు.

కొడిమ్యాల: మండలంలోని గౌరాపూర్, నల్లగొండ, రాంసాగర్, రామకిష్టాపూర్ గ్రామాల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది పత్తి, వరి నారు మళ్ళను, జీలుగ పంటను పరిశీలించారు. పత్తి, వరినారు ఎదగటానికి తీసుకోవాలిసిన జాగ్రత్తలను రైతులకు ఏవో వివరించారు. ఏఈవోలు మంజుల, శ్రీనివాస్, గ్రీష్మ, లావణ్య ఉన్నారు.

- ప్రొఫెసర్ జయశంకర్ రాజేంద్రనగర్(హైదరాబాదు) వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ఉప కులపతిని నియామకం చేయాలని వ్యవసాయ విశ్వవిద్యాలయం సలహా మండలి మాజీ సభ్యుడు, పూడూర్ మాజీ సర్పంచు వెల్ముల రాంరెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గురువారం ఒక ప్రకటనలో కోరారు.

మెట్‌పల్లి రూరల్: మండలంలోని వెల్లుల్ల గ్రామానికి చెందిన జుంగుల గంగాధర్‌గౌడ్ ఇటివల తాటి చెట్టుపై నుంచి జారిపడి మృతి చెందగా కుటుంబ సభ్యులకు గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గొల్లపెల్లి చంద్రశేఖర్‌గౌడ్ ఐదు వేల రూపాయలను అందించారు.

- మెట్‌పల్లి మండలంలోని ఆత్మకూర్, కోండ్రికర్ల గ్రామాలలోని ప్రభుత్వం పాఠశాలలోని 56 మంది విద్యార్థులకు ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా నోటుబుక్స్‌ను, స్టేషనరీలను నాయకులు అందజేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు సురిగి శ్రీనివాస్, బంటి, చింటు, రాజేష్ పాల్గొన్నారు.

- మొక్క జొన్న పంటకు మహమ్మారిలా మారుతున్న చీడపీడలు కత్తెర పురుగు, కాండం తొలుచుతో పాటు తెగుళ్లు ఆశించకుండా సాగు చేస్తున్న రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి షాహిద్‌అలీ అన్నారు. మండలంలోని ఆత్మకూర్‌లో రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న పంటలను పరిశీలించారు. పంటకు పురుగు ఆశించకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని, వీటి నివారణకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల గురించి రైతులకు అవగాహన కల్పించారు. నాయకులు, రైతులు చౌటుపల్లి అంజయ్య, కాటుపల్లి ప్రదీప్, మగ్గిడి భూమరెడ్డి, తుమ్మల రాజారెడ్డి, తుక్కరెడ్డి, ఏఈవో భూమేశ్వర్, తదితరులు ఉన్నారు.

కథలాపూర్: సిరికొండలో పెసర పంట సాగును ఏవో యోగిత పరిశీలించారు. పెసర వేరు బొడిపెల్లో నత్రజని స్థిరీకరించే బాక్టీరియా ఉంటుందని దీంతో యూరియా వినియోగం తగ్గించుకోవచ్చని తెలిపారు.

- కథలాపూర్ మండలంలోని భూషణరావుపేటకు ప్రభుత్వం మీసేవా కొత్తగా మంజూరు చేసిందని సెర్ప్ ఏపీఎం నరహరి తెలిపారు. మహిళా సంఘాల సభ్యులతో కేంద్రం నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు.

మల్లాపూర్: మల్లాపూర్‌లోని ఎస్టీ మినీ గురుకుల పాఠశాలలో వైద్య శిబిరం వైద్యాధికారి వాహినిరెడ్డి నిర్వహించారు. విద్యార్థులకు ఎత్తు, బరువులు పరిశీలించి ఆరోగ్య సమస్యలను పరిశీలించారు.

- ధాంరాజుపల్లి గ్రామానికి చెందిన హన్మండ్లును ఉపాధ్యక్షుడిగా నియమించి జిల్లా అధ్యక్షుడు పులి నర్సయ్య నియామకపత్రం అందజేశారు.

ఎండపల్లి: మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన వేముల మల్లేశం గౌడ్ అనారోగ్యంతో గురువారం మృతి చెందగా ఆయన మృతదేహానికి మాజీ మంత్రి రాజేశం గౌడ్ నివాళి అర్పించి, మృతుని కుటుంబాన్ని పరామర్శించారు.